## క్లుప్తంగా

### మహాలక్ష్మి అమ్మవారికి కుంకుమార్చనలు



సామర్లకోట: స్థానిక మెహర్ కాంప్లెక్స్‌లోని లక్ష్మీగణపతి ఆలయం ఆవరణలోని మహాలక్ష్మీ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. సప్తమి, స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని సాయంత్రం అమ్మవారికి ఆలయ ప్రధానార్చకుడు తిరుమలకుమార్ ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. అమ్మవారికి పట్టువస్త్రాలతో అలంకరణ చేశారు. పూజలు తిలకించడానికి వచ్చిన భక్తులకు ప్రసాద వితరణ చేశారు.

### మరిడమ్మకు ప్రత్యేక పూజలు



వెండి, బంగారు పుష్పాలతో మరిడమ్మతల్లి

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మ అమ్మవారికి శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావుల ఆధ్వర్యంలో కార్తిక మాస ద్వాదశి పూజల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, చండీ హోమంతో పాటు బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించగా అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

### పోటీ పరీక్షలపై అవగాహన సదస్సు

పెద్దాపురం: గ్రూప్స్, డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు ఆదివారం కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో నిర్వహించే అవగాహన సదస్సును సద్వినియోగం చేసుకోవాలని మండల యూటీఎఫ్ శాఖ విజ్ఞప్తి చేసింది. మండల యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు సీహెచ్ కరుణాకర్, బి.జాన్ కెనడీలు శుక్రవారం స్థానిక విలేకర్లకు ఓ ప్రకటన విడుదల చేశారు. పోటీ పరీక్షల శిక్షణ నిపుణులు ఎమ్మెల్సీలు కేఎస్ లక్ష్మణరావు, ఐ.వెంకటేశ్వరరావుల ఆధ్వర్యంలో యూటీఎఫ్, జెవీవీ, ఎస్ఎఫ్ఐ, డీవైఎఫ్ఐ సంఘాలు సంయుక్తంగా ఈ అవగాహన సదస్సును ఏర్పాటు చేశాయన్నారు. పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఆ రోజు సాయంత్రం నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. అనంతరం భారత సమాజం, ఆంధ్రుల చరిత్ర, ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ సబ్జెక్టులు సంబంధించిన మెటీరియల్‌ను ఉచితంగా అందజేయనున్నట్టు తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కరుణాకర్, కెనడీలు కోరారు.

### సద్వినియోగం చేసుకోండి

పిఠాపురం: గ్రూప్స్, డీఎస్సీ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థులకు యూటీఎఫ్ ఆధ్వర్యంలో కాకినాడ అంబేడ్కర్ భవన్‌లో ఆదివారం సాయంత్రం అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్టు యూటీఎఫ్ గొల్లప్రోలు శాఖ నాయకుడు జి.ఈశ్వరరావు తెలిపారు. దీనిని పోటీ పరీక్షల కోచింగ్ నిపుణుడు కేఎస్ లక్ష్మణరావు, ఉభయ గోదావరి జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఇళ్ల వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించనున్నట్టు తెలిపారు. అవసరమైన మెటీరియల్‌ను ఉచితంగా అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని యువతీ, యువకులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

### తహసీల్దార్‌గా రాజ్‌కుమార్



కొత్తపల్లి: మండల తహసీల్దార్‌గా కె.రాజ్‌కుమార్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల నేపథ్యంలో బదిలీల్లో భాగంగా ఏలూరు జిల్లా మండవల్లి మండలంలో విధులు నిర్వహిస్తున్న ఆయన ఇక్కడకు వచ్చారు. ఇక్కడ పనిచేసిన జీవీఎస్ ప్రసాద్ పోలవరానికి బదిలీ అయ్యారు. అన్ని శాఖల అధికారుల సమన్వయంతో ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహిస్తామని రాజ్‌కుమార్ అన్నారు. ముఖ్యంగా సమస్యాత్మక గ్రామాలు, పోలింగ్ కేంద్రాలపై దృష్టి పెడతామని అన్నారు.

### కాకినాడ వెళ్లి పింఛను అందజేత



సూర్యావతికి పింఛను అందజేస్తున్న గంగాభవాని

సామర్లకోట: స్థానిక బలుసులపేట సచివాలయానికి చెందిన వలంటీర్ కాకినాడ వెళ్లి శుక్రవారం పింఛను అందజేశారు. 13వ వార్డు గొల్లపేటకు చెందిన పిడుగు సూర్యావతి కాకినాడ ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతోంది. ఈ మేరకు వార్డు కౌన్సిలర్ నేతల హరిబాబు సూచన మేరకు వలంటీరు ఐ గంగాభవాని కాకినాడ ప్రభుత్వాస్పత్రికి వెళ్లి పింఛను అందజేశారు.

# సిద్ధంకండి... తరలిరండి

- కో ఆర్డినేటర్ దవులూరి దొరబాబు
- నియోజకవర్గ కార్యకర్తల సమావేశం



సిద్ధం సభకు సన్నద్ధం కావాలని పిలుపునిస్తున్న దవులూరి దొరబాబు

సామర్లకోట: ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం జరిగే సిద్ధం సభను జయప్రదం చేయాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు పిలుపు నిచ్చారు. శుక్రవారం సాయంత్రం స్థానిక పార్టీ క్యాంపు కార్యాలయం వద్ద నియోజకవర్గ కార్యకర్తల సమావేశం ఏర్పాటు చేసి సిద్ధం సభ ప్రాధాన్యాన్ని వివరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ నియోజకవర్గం నుంచి అధిక సంఖ్యలో ప్రజలు సభకు తరలిరావడానికి ఉత్సాహంగా ఉన్నారన్నారు. జగనన్న పాలనలో చేసిన అభివృద్ధి, సంక్షేమాలతో పాటు రాబోయే కాలంలో ఏం చేస్తారో ఆయన వివరించనున్నారన్నారు. నియోజకవర్గం నుంచి 100 బస్సులలో బయలు దేరడానికి సిద్ధంగా ఉన్నామని తెలిపారు. టీడీపీ, జనసేనకు చెందిన వారికి సైతం సంక్షేమ పథకాలు అందజేశామని, జగన్‌మోహన్‌రెడ్డికి మా ఆశీస్సులు ఉంటాయని ప్రతి ఒక్కరూ చెప్తున్నారన్నారు. దీర్ఘకాలం తరువాత స్థానిక అభ్యర్థిగా నియోజకవర్గం నుంచి పోటీ చేసే అవకాశం తనకు ఇచ్చారని, నియోజకవర్గానికి మంచి పాలన అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం కార్యకర్తల సమావేశంలో పాల్గొని మాట్లాడుతూ జగనన్న పాలనలో జరిగిన అభివృద్ధిని వివరిస్తారని, దానిని శ్రద్ధగా విని ప్రజలకు వివరించాలని దవులూరి సూచించారు. ప్రతి గ్రామానికి వార్డుకు చెందిన కార్యకర్తలు తమ పరిధిలో ఉన్న గృహసారథులు ఈ సమావేశానికి వచ్చేలా చూడాలన్నారు. ఆయా వార్డు గ్రామాల నుంచి తరలి వచ్చే ప్రజల అవసరాలను గృహసారథులు తీర్చేలా చూడాలని ఆయన పిలుపునిచ్చారు. పెద్దాపురం ఏడీబీ రోడ్డులోని పాండవుల మెట్ట నుంచి బస్సులు బయలు దేరతాయని దొరబాబు చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి ఆవాల లక్ష్మీనారాయణ, మున్సిపల్ వైస్ చైర్మన్లు ఉబా జాన్‌మోజెస్, నెక్కంటి సాయిప్రసాద్, గొకిన సునేత్రాదేవి, ఎంపీపీలు బొబ్బరాడ సత్తిబాబు, పెంకే సత్యవతి, పెద్దాపురం జెడ్పీటీసీ సభ్యుడు గవరసాని సూరిబాబు, దవులూరి చారిటబుల్ ట్రస్టు అధినేత దవులూరి సుబ్బారావు, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్, సొసైటీ అధ్యక్షులు మేకా శ్రీనివాసు తదితరులు పాల్గొన్నారు.

## చెత్తశుద్ధి లేదా..!



కొండెవరంలో రోడ్డు పక్కన పేరుకుపోయిన చెత్త



వేంకటేశ్వరస్వామి ఆలయం వద్ద డ్రైన్ ఇలా..

కొత్తపల్లి: కొండెవరం గ్రామంలో పారిశుధ్య సమస్య వేధిస్తోంది. ప్రజలు చెబుతున్నా అధికారులు నిర్లక్ష్యం వీడడం లేదు. ఇక్కడి ప్రధాన రహదారులు, ఆలయాల వద్ద చెత్త పేరుకుపోయింది. డ్రైన్లు పూడికతో నిండిపోయాయి. మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తుంది. దుర్వాసన వెదజల్లడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్యమంటే ఇంత నిర్లక్ష్యమా అంటూ స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బయటకు రావాలంటే ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొందని అంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరుతున్నారు.

## చిత్రాడ అభివృద్ధికి సహకారం



గ్రామస్తులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీ వంగా గీత

పిఠాపురం: నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేపట్టిన కాకినాడ ఎంపీ వంగా గీతకు పిఠాపురం మండలం చిత్రాడకు చెందిన ఎస్సీ, బీసీ సామాజిక వర్గాలకు చెందిన సుమారు 200 మంది మద్దతు తెలిపారు. శుక్రవారం కాకినాడలో ఆమెను స్థానిక డీసీసీబీ మాజీ డైరెక్టర్ గుడాల రామకృష్ణ ఆధ్వర్యంలో కలసిన గ్రామస్తులు మద్దతు ప్రకటించారు. శనివారం నిర్వహించనున్న సీఎం వైఎస్ జగన్ సిద్ధం సభకు భారీగా తరలివెళ్లేందుకు కార్యాచరణ చేశామని వారన్నారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ చిత్రాడ అభివృద్ధికి తనవంతు సహకారం తప్పకుండా ఉంటుందన్నారు. ఇప్పటికే అనేక అభివృద్ధి పనులు చేశామన్నారు.

## చిన జగ్గంపేటలో ఇరువర్గాల ఘర్షణ

పిఠాపురం: గేదె విషయంలో ఇరువర్గాల మధ్య నెల కొన్న వివాదం ఘర్షణకు దారితీసింది. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేశారు. గొల్లప్రోలు ఎస్సై బాలాజీ కథనం ప్రకారం.. గొల్లప్రోలు మండలం చిన జగ్గంపేటలో గురువారం రాత్రి స్థానికుడు మంగం మల్లికార్జునరావు, అతని కుటుంబ సభ్యులు మరికొందరు కలసి అదే గ్రామానికి చెందిన ఒమ్మి కృష్ణ (పుట్టయ్య) ఇంటికి వెళ్లి తమ గేదెను ఇచ్చేయాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇరువర్గాల మధ్య వివాదం చెలరేగి చివరకు ఘర్షణకు దారితీసింది. దీంతో పరిస్థితి అదుపుతప్పి ఒకరిపై ఒకరు దాడికి దిగారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. తిరిగి వివాదం రేగకుండా గ్రామంలో పోలీసు పికెట్ ఏర్పాటు చేశారు. ఇరువర్గాలపై కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు. శుక్రవారం గ్రామంలో పర్యటించిన పిఠాపురం సీఐ శ్రీనివాస్ గ్రామస్తులతో సమావేశం నిర్వహించి శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అందరూ సామరస్యంగా ఉండాలని సూచించారు.

### హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే జరిమానా

బాలాజీచెరువు: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శనివారం నుంచి ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తే రూ.వెయ్యి జరిమానా విధిస్తున్నట్లు జిల్లా రవాణాశాఖాధికారి ఎ.మోహన్ తెలిపారు. కారులో సీటు బెల్టు లేకుండా ప్రయాణించినా ఇదే జరిమానా వర్తిస్తుందన్నారు.

### చోరీ కేసులో వ్యక్తికి జైలు

కొత్తపల్లి: చోరీకి పాల్పడిన వ్యక్తికి ఏడాది జైలుశిక్ష విధిస్తూ పిఠాపురం కోర్టు న్యాయమూర్తి ఎం.సుధారాణి తీర్పు ఇచ్చినట్లు శుక్రవారం ఎస్సై స్వామినాయుడు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. శ్రీరాంపురంలోని కనకదుర్గమ్మ ఆలయంలో గత ఏడాది మార్చి 23న అమ్మవారి బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయి. దీనిపై అప్పటి ఎస్సై రామలింగేశ్వరరావు కేసు నమోదు చేశారు. ఈ చోరీ చేసిన ప్రత్తిపాడు మండలం ధర్మవరం గ్రామానికి చెందిన ద్వారం రవిప్రసాద్‌కు ఏడాది జైలుశిక్ష విధించినట్లు ఎస్సై వివరించారు.

# జలపుష్పం అధరహో



చేపల పాట నిర్వహిస్తున్న మత్స్యకారులు

### రూ.18 లక్షలకు పైగా వ్యాపారం



కొనుగోలు చేసిన చేపలను తీసుకువెళ్తూ..

కొత్తపల్లి: అమీనాబాద్ శివారు చేపల రేవు శుక్రవారం మత్స్యకారులకు చిక్కిన భారీ కోనెం చేపలతో కిటకిటలాడింది. బోట్లపై వేటకు వెళ్లిన వారికి సుమారు 3 టన్నుల కోనెం చేపలు పడ్డాయి. వీటి విలువ రూ.18 లక్షలు. వ్యాపారులు వీటిని కొనుగోలు చేసి తమిళనాడు, కేరళ, హైదరాబాద్, బెంగళూరు వంటి ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో కోనెల వ్యాపారం భారీగా జరుగుతుంది. సుమారు కిలో చేప ధర రూ.550 నుంచి రూ.650కు ధర పలుకుతుంది. ఇంత ధర రావడం ఇదే మొదటి సారి అని మత్స్యకారులు తెలిపారు.

## హాస్టల్ విద్యార్థిని గుర్తించిన రైల్వే పోలీసులు



తల్లిదండ్రులు, హాస్టల్ సిబ్బందికి జయరాంను అప్పగించిన రైల్వే పోలీసులు

సామర్లకోట: తల్లిదండ్రులపై బెంగతో పిఠాపురంలోని ఎస్సీ సంక్షేమ హాస్టల్ నుంచి వచ్చి సామర్లకోటలో అనుమానాస్పదంగా తిరుగుతున్న బాలుడిని పోలీసులు తల్లిదండ్రులు, హాస్టల్ సిబ్బందికి శుక్రవారం అప్పగించారు. రైల్వే ఎస్సై బి.లోవరాజు కథనం ప్రకారం అనకాపల్లి జిల్లా చోడవరానికి చెందిన చుక్క జయరాం పిఠాపురంలో 9వ తరగతి చదువుతూ ఎస్సీ సంక్షేమ హాస్టల్ ఉంటున్నాడు. అయితే గురువారం తల్లిదండ్రులపై బెంగతో సామర్లకోట వచ్చి ఎటు వెళ్లాలో తెలియక విజయవాడ వైపు వెళ్లే రైలు ఎక్కి విజయవాడ వెళ్లిపోయాడు. హాస్టల్ నుంచి విద్యార్థి కనిపించడం లేదని తెలిసి తల్లిదండ్రులు గాలింపు చేపట్టారు. ఈ క్రమంలో విజయవాడలో చోడవరం ఎలా వెళ్లాలన్న సమాచారం తెలుసుకుని సామర్లకోట మీదుగా విశాఖపట్నం వైపు వెళ్లే రైలు ఎక్కాడు. రైలు బోగిలో టిక్కెట్ కలెక్టర్‌కు జయరాంపై అనుమానం వచ్చి సామర్లకోట రైల్వే పోలీసులకు అప్పగించాడు. ఈ మేరకు వివరాలు సేకరించి తల్లిదండ్రులు,హాస్టల్ సిబ్బందికి రైల్వే ఎస్సై లోవరాజు సమాచారం ఇచ్చి వారికి బాలుడిని క్షేమంగా అప్పగించారు.

## తాళ్లూరు ఎంపీటీసీ మృతికి సంతాపం



సంతాప సభలో ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

పెద్దాపురం: గండేపల్లి మండలం తాళ్లూరు ఎంపీటీసీ షేక్ మదీనా వలీ మృతి ముస్లింలకు తీరనిలోటని పెద్దాపురం దర్గా కమిటీ అధ్యక్షులు లాయక్ ఆలీ అన్నారు. స్థానిక దర్గా వద్ద శుక్రవారం ఎంపీటీసీ వలీ సంతాప సభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్గా కమిటీ సభ్యులుగా గత 50 ఏళ్ల నుంచి వలీ సేవలందించారన్నారు. ఆయన మృతి దర్గా కమిటీతో పాటు ముస్లింలకు తీరనిలోటని ఎంఎల్ ఆలీ అన్నారు. అనంతరం వారు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

# ఎలుకలను సామూహికంగా నిర్మూలించాలి



కాండ్రకోటలో రైతులకు ఎలుకల మందు పంపిణీ చేస్తున్న డీఏఓ హరి



పొలం గట్ల బొరియల వద్ద ఎలుకల మందు పొట్లాలు పెట్టే విధానంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ, ఏఓలు



చేబ్రోలులో ఎలుకల మందు కలిపే విధానాన్ని రైతులకు వివరిస్తున్న అధికారులు

పెద్దాపురం: రైతులందరూ సామూహికంగా దృష్టి సారిస్తే ఎలుకల నిర్మూలన సాధ్యపడుతుందని జిల్లా ఇన్‌చార్జి వ్యవసాయ శాఖాధికారి బీవీఎస్‌సీ హరి అన్నారు. మండలంలోని కాండ్రకోట రైతు భరోసా కేంద్రం వద్ద శుక్రవారం ఎలుకల మందు పంపిణీ నిర్వహించారు. ఎంపీటీ సంజయ్‌కుమార్ అధ్యక్షతన జరిగిన సభలో ఎలుకల మందును పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డీఏఓ హరి, జెడ్పీటీసీ గవరసాని సూరిబాబు మాట్లాడుతూ రైతులంతా ఒక్కసారే ఎలుకల నివారణ మందును పంటలో ఉంచినప్పుడు పూర్తి స్థాయిలో ఎలుకలను నివారించవచ్చన్నారు. ఏడీఏ దైవకుమార్, ఏఓ సంజయ్ బ్రోమోడయోలిన్ విషపు ఎరను తయారు చేసుకునే విధానంపై రైతులు అవగాహన పెంచుకోవాలన్నారు. 96 పాళ్ల నూకలు, రెండు పాళ్ల నూనె, రెండు పాళ్ల విషము కలిపిన ఎలుకల మందును రైతులకు ఉచితంగా పంపిణీ చేశారు. అనంతరం ఎలుకల నిర్మూలన పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు పల్ల గంగారావు, గవరసాని రాజశేఖర్, పార్టీ నాయకులతో పాటు రైతులు పాల్గొన్నారు.

సామర్లకోట: ఆయా గ్రామాల్లో రైతులు అందరూ ఒకేసారి సామూహిక ఎలుకల నివారణ మందులు ఉపయోగించడం వలన పంట నష్టం తగ్గించుకునే అవకాశం ఉంటుందని కాకినాడ వ్యవసాయ సహాయ సంచాలకురాలు జీవీ పద్మశ్రీ అన్నారు. మండల పరిధిలో చంద్రంపాలెంలోని రైతులకు ఎలుకల మందు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మందు కలిపే విధానాన్ని వివరించారు. అలాగే పొలాల గట్ల వద్ద ఎలుకల బొరియలల్లో కలిపిన మందు పొట్లాలను పెట్టాలని ఆమె సూచించారు. ఎలుక జీవిత కాలం ఏడాది నుంచి 18 నెలలు ఉంటుందని, మూడు నెలల వయసు నుంచి అవి పిల్లలు పెడతాయని తెలిపారు. దీనివల్ల ఎలుకల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సందర్భంగా యాంత్రిక, రసాయన పద్ధతులపై అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 15 లోపుగా ఈ-క్రాప్ బుక్కింగ్, ఈకె వైసీలను పూర్తి చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి ఐ.సత్య, సర్పంచ్ చీమల భవాని, ఆర్బీకే సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పిఠాపురం: ప్రస్తుత రబీలో ఎలుకలతో పంటలు దెబ్బ తినకుండా జాగ్రత్తలు చర్యలు తీసుకోవాలని పిఠాపురం ఏడీఏ పి.స్వాతి అన్నారు. నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఆమె రైతు భరోసా కేంద్రాల సిబ్బందితో కలిసి సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరి పంటపై ఆకునల్లి, ఆకుముడత, కాండం తొలుచు పురుగు, ఎండాకు తెగులు, పాము పొడ తెగులు వంటివి ఆశించే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ముఖ్యంగా ప్రస్తుతం ఎలుకల బెడద ఎక్కువగా ఉన్నందున ప్రభుత్వం వ్యవసాయ శాఖ ద్వారా సామూహిక ఎలుకల నివారణా కార్యక్రమం చేపట్టిందన్నారు. నియోజకవర్గంలో రైతులు తమ పొలాల్లో ఎలకల నివారణకు 90 కిలోల బ్రోమోడయోలిన్ మందును సిద్ధం చేశామన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సమావేశం

బాలాజీచెరువు: జిల్లా గ్రంథాలయ సంస్థ పెన్షనర్ల సంక్షేమ సంఘ సమావేశం గురువారం గ్రంథాలయ సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. సంఘ అధ్యక్షులు ఎం.సంజయశ్రీ అధ్యక్షతన జరిగిన సమావేశంలో పెన్షనర్ల సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. నివేదికను సంఘ ప్రధాన కార్యదర్శి సలాది సాయి సత్యనారాయణ వివరించారు. అనంతరం సీనియర్ సభ్యులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో గట్టి రామారావు, సత్యనారాయణ, రాధాకృష్ణమూర్తి పాల్గొన్నారు.

### వేళంగిలో మార్కెట్ యార్డ్ చెక్‌పోస్ట్

కరప: మండలం వేళంగిలో ఏర్పాటు చేసిన మార్కెట్ యార్డ్ చెక్‌పోస్ట్‌ను శుక్రవారం కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కర్నాసుల సీతారామాంజనేయులు ప్రారంభించారు. ఈ చెక్‌పోస్ట్ ద్వారా కరప వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని వేళంగి పరిసర గ్రామాల నుంచి ఆదాయం సమకూరుతుందన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు యాళ్ల సుబ్బారావు, ఎంపీపీ పెంకే శ్రీలక్ష్మి, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు చింతా ఈశ్వరరావు, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు రొక్కాల గణేష్, మండల యూత్ అధ్యక్షుడు పెంకే సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

## రాష్ట్ర స్థాయి పోటీలకు సామర్లకోట క్రీడాకారులు



రాష్ట్ర స్థాయికి ఎంపికైన క్రికెట్ జట్టు సభ్యులను అభినందించిన దవులూరి దొరబాబు



చంద్రంపాలెం మహిళల కబడ్డీ జట్టు

సామర్లకోట: ఆడుదాం ఆంధ్రా ఆటల పోటీల్లో భాగంగా కాకినాడ డీఎస్ఏ మైదానంలో శుక్రవారం నిర్వహించిన క్రికెట్ పోటీల్లో సామర్లకోట 8వ సచివాలయానికి చెందిన క్రికెట్ జట్టు విజయం సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్టు 14 వార్డు కౌన్సిలర్ స్వయంభారపు వీరభద్రరావు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం సాయంత్రం నియోజకవర్గ కోఆర్డినేటర్ దవులూరి దొరబాబు జట్టు సభ్యులను అభినందించారు. రాష్ట్ర స్థాయి పోటీల్లో కూడా మంచి ప్రతిభ కనబర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఉబా జాన్‌మోజెస్, స్థానిక కౌన్సిలర్లు పాల్గొన్నారు. ఫైనల్ మ్యాచ్‌లో సామర్లకోట జట్టు నిర్దేశిత 10 ఓవర్లలో 90 పరుగులు చేయగా ముమ్మిడివరం జట్టు 30 పరుగులు మాత్రమే చేసి ఓటమి పాలైందని కౌన్సిలర్ వీరభద్రరావు తెలిపారు.

**రాష్ట్ర స్థాయికి మహిళల కబడ్డీ జట్టు**

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు సామర్లకోట మండలం చంద్రంపాలెం మహిళల జట్టు ఎంపికైందని పీడీ కె.వీరబాబు శుక్రవారం రాత్రి తెలిపారు. శుక్రవారం కాకినాడలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీలో ఫైనల్స్‌లో విజయం సాధించడంతో విశాఖలో జరిగే రాష్ట్ర స్థాయి పోటీల్లో ఆడనుందన్నారు.

ఈ మేరకు చంద్రంపాలెం గ్రామ పెద్దలు, సర్పంచ్ చీమల భవానీ తదితరులు జట్టు సభ్యులను అభినందించారు.

## అంబేడ్కర్ ఎస్సీ హాస్టల్ అభివృద్ధికి కృషి

- సొంత నిధులతో ఒక గదిని నిర్మిస్తా
- ఎమ్మెల్యే ద్వారంపూడి హామీ



వసతి గృహాన్ని సందర్శించి మాట్లాడుతున్న ఎమ్మెల్యే ద్వారంపూడి

కాకినాడ: కాకినాడ బాలాజీచెరువు సెంటర్ సమీపంలోని అంబేడ్కర్ ఎస్సీ వసతిగృహం (డిగ్రీ విద్యార్థులు) అభివృద్ధికి అన్ని విధాలా తోడ్పడతానని ఎమ్మెల్యే ద్వారంపూడి చంద్రశేఖరరెడ్డి హామీ ఇచ్చారు. శుక్రవారం ఆయన హాస్టళ్లను సందర్శించారు. దివంగత లోక్‌సభ స్పీకర్ జీఎంసీ బాలయోగితో పాటు ఎంతోమంది ప్రముఖులు ఇక్కడి హాస్టల్‌లో చదివి ఉన్నత స్థాయికి ఎదిగారని, అటువంటి చరిత్ర కలిగిన వసతి గృహం మరింత అభివృద్ధి జరిగేలా సహకరిస్తానన్నారు. ఇప్పటికే ఎంపీ నిధులతో పాటు ఎమ్మెల్యే అభివృద్ధి నిధులను కూడా వెచ్చించి అభివృద్ధి చేసేందుకు సంకల్పించామన్నారు. శిథిలావస్థకు చేరిన గదులను పునర్నిర్మించడంతో పాటు ఆధునిక హంగులతో డైనింగ్ హాల్ నిర్మాణం కూడా చేపట్టామన్నారు. ప్రభుత్వ నిధులతో పాటు కొంతమంది దాతల సహకారాన్ని కూడా తీసుకుని అత్యంత అధునాతనంగా వసతి గృహాన్ని తీర్చిదిద్దేందుకు కృషి చేస్తానన్నారు. హాస్టల్‌లో ఒక గదిని సకల సౌకర్యాలతో సొంత ఖర్చులతో నిర్మిస్తానని ఎమ్మెల్యే ద్వారంపూడి హామీ ఇచ్చారు. భవిష్యత్‌లో కనీసం మూడు అంతస్తుల్లో భవనం రూపుదిద్దుకునేలా తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట కౌడా చైర్‌పర్సన్ రాగిరెడ్డి చంద్రకళాదీప్తి, వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షురాలు సుంకర శివప్రసన్న, ఎస్సీ నాయకులు పిల్లి రామారావు, కింగ్ కుమార్‌బాబు, రామేశ్వరరావు, విజయ్‌శేఖర్ తదితరులు ఆయన వెంట ఉన్నారు.